క్లుప్తంగా

గణేష్ టెంపుల్‌లో ఉత్సవాలకు తరలిరండి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఈఓ సులోచన, కమిటీ చైర్మన్ శంకర్‌బాబు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో ఈ నెల 15 నుంచి 24 వరకు జరగనున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని, ఈఓ కె.సులోచన, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి శంకర్‌బాబు భక్తులను కోరారు. శనివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఈఓ కె.సులోచన, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి శంకర్‌బాబు మాట్లాడుతూ.. తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాల్లో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనిఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరు వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, ఆయుర్వేద మొక్కలను పెంచాలి



కోడిపుంజులవాగు అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న స్థలంలో పండ్లు, ఆయుర్వేద మొక్కలను పెంచాలని సీడీపీఓ కనకదుర్గ అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. కోడిపుంజుల వాగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పోషణ వాటికను పరిశీలించారు. చనిపోయిన మొక్కల స్థానంలో మొక్కలను నాటించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంతరాణి, టీచర్లు సుజాత, చుక్కమ్మ, తులసిరత్నం, కృష్ణవేణి, శంకరమ్మ, కళావతి, సీతమ్మ, వీరభద్రమ్మ, ఆయాలు సక్కుభాయి పాల్గొన్నారు.

జీసీసీ గోదాంలో పరిశీలన



స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న డీటీ

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గోదాంను శనివారం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. బియ్యం నిల్వల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గతంలో పాల్వంచ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ 600 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూ.8.40 లక్షలకు ఇటీవల విక్రయించారు. బియ్యాన్ని కొనుగోలు చేసిన వారికి డీటీ దగ్గర ఉండి అప్పగించారు. ఆయన వెంట గోదాం ఇన్‌చార్జ్ రమేష్ ఉన్నారు.

ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ..

బతుకమ్మ సంబురాలు శనివారం ప్రారంభమయ్యాయి. వివిధ రకాల పువ్వులను సేకరించి బతుకమ్మలను పేర్చిన మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చి వాగులు, చెరువుగట్టు, ఆలయాల వద్ద తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ.., ఉయ్యాలో.., బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., చిత్తూచిత్తూల బొమ్మ... శివుని ముద్దు లగుమ్మ అంటూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ఆయా గ్రామాల్లోని చెరువులు, కాలువలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: కేటీపీఎస్ ఇంజనీర్స్ కాలనీలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు



టేకులపల్లి రామాలయం వద్ద వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, జెడ్పీ చైర్మన్



కొత్తగూడెంటౌన్: మధుర బస్తీలో..



రామవరం వనందాస్‌గడ్డ బస్తీలో..



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలో...



ఇల్లెందు కళాసీ బస్తీ ఉషోదయ స్కూల్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జూలూరుపాడు: దిశ సభ్యులతో సీఐ శ్రీనివాస్



పాల్వంచరూరల్: కిన్నెరసానిలో...



యానంబైల్ గ్రామంలో సీతారామాలయం వద్ద



సుజాతనగర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కొత్తగూడెంఅర్బన్: తాటిపల్లి రెసిడెన్సీలో..



ఇల్లెందురూరల్: గురుకుల కళాశాల వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నేటినుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



కొత్తగూడెంటౌన్: విద్యుత్ దీపాలంకరణలో గణేష్ టెంపుల్

- 23వ తేదీ వరకు మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో రోజుకో అవతారంలో అమ్మవారికి అలంకరణ

కొత్తగూడెంటౌన్: ఆదివారం నుంచి 23వ తేదీ వరకు దేవీశరన్నరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. పలు కూడళ్లు, ఆలయాల ప్రాంగణాల్లో అమ్మవారి మండపాలను ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాలు

ఆదివారం	శ్రీబాలాత్రిపుర సుందరీదేవి
సోమవారం	శ్రీ వేదమాత గాయత్రీదేవి
మంగళవారం	శ్రీచాముండేశ్వరీదేవి
బుధవారం	శ్రీఅన్నపూర్ణాదేవి
గురువారం	శ్రీ ధనలక్ష్మీదేవి
శుక్రవారం	శ్రీ సరస్వతీదేవి
శనివారం	శ్రీమంగళగౌరీ దేవి
ఆదివారం	శ్రీభద్రకాళీ దేవి
సోమవారం	శ్రీ వనదుర్గా దేవి

చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉత్సవాలకు సిద్ధం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని ఏ పవర్‌హౌస్ బస్తీలోని శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానానికి ప్రత్యేకత ఉంది. కొత్తగూడెం సింగరేణి ప్రాంతం కావడంతో గుంటి రాజయ్య, డాక్టర్ శ్రీనివాసరావు, ఇరోడి చంద్రశేఖర్ (సింగరేణి ఆఫీసర్), సురేష్, వెంకయ్య, లక్ష్మీనారాయణ కమిటీ, దాతల సహకారంతో, ప్రముఖ వాస్తు పండితులు ఫణిబట్ల శివరామకృష్ణ సలహాలతో ఇక్కడ భక్తుల కోసం 1991–92 ఏడాదిలో శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను శ్రీఇంద్రగంటి శంకర ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1992–93లో నిర్మాణం పూర్తి చేసుకుంది. అనంతరం శ్రీకంచిపీఠం వారి సూచన మేరకు 1999 శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శివాలయంతో పాటు నవగ్రహ, నాగేంద్రస్వామి విగ్రహాలను సైతం ప్రతిష్ఠించారు, 45 రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. 30 ఏళ్ల నుంచి భక్తుల నుంచి విశేష ఆదరణతో భక్తులకు కోరిన కోరికలను తీర్చే ఆలయంగా ప్రాచుర్యం పొందింది.

నిరంతరాయంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్వామి వారికి బ్రహ్మోత్సవాలు, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, గణపతి నవరాత్రుల ఉత్సవాలు, శివరాత్రుల ఉత్సవం, శ్రావణమాసం పూజలు, కార్తీకమాసం పూజలతో పాటు ప్రతీరోజు నిత్యం పూజా కార్యక్రమాలతో ఆలయం ఎప్పుడూ భక్తులతో రద్దీగా ఉంటుంది.

ఘనంగా శరన్నవరాత్రుల మహోత్సవాలు..

శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకు జరగనున్న శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. కొత్తగూడెంలోని ప్రజలే కాకుండా చుట్టు పక్కల నుంచి ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారు తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారు.



శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం

భక్తుల కొంగు బంగారం అమ్మవారు...



శ్రీకనకదుర్గ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలతో పాటు పలు పవిత్ర పూజలను వైభవంగా నిర్వహిస్తాం. కోరిన కోరికలను తీర్చే అమ్మవారు కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– ప్రతాప మాధవశాస్త్రి, ఆలయ అర్చకులు, కొత్తగూడెం

కార్మికులపై అమ్మవారి చల్లని చూపు..



పీవీకే-5 షాఫ్ట్ వద్ద ముస్తాబైన అమ్మవారి ఆలయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, ఓపెన్‌కాస్ట్, వివిధ విభాగాలలో ఈనెల 15 నుంచి 23వ, తేదీ వరకు 9రోజుల పాటు శ్రీదేవిశరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆయా గనుల వద్ద కొలువైన ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా విభాగాల ఉన్నతాధికారులు, హెచ్ఓడీలు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించటం ఏళ్ల తరబడి వస్తున్న ఆనవాయితీ. ఈ వేడుకలకు ఉన్నతాధికారులు కుటుంబసభ్యులతో హాజరుకావటం విశేషంగా భావిస్తారు. ఏరియాలలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే కార్మికులు వందల అడుగుల లోతుల్లో, భారీ యంత్రాల వద్ద పనులు చేస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు దసరా ఉత్సవాల్లో ప్రత్యేకంగా అమ్మవారిని కొలుస్తారు. ఈ వేడుకల చివరి రోజు విజయదశమి రోజున యంత్రాలు, పనిముట్లక పూజలు నిర్వహిస్తారు. ప్రమాదాలు జరగకుండా కాపాడమని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మేకలు, గొర్రెలు, కోళ్లని బలిఇచ్చి అమ్మవారికి తర్పణం చేస్తారు.

71 ఏళ్లుగా వేడుకలు



కొత్తగూడెం ఏరియాలో 1952లో ఏర్పాటైన ఈ గని (పీవీకే-5షాఫ్ట్)లో సుమారు 71 సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఈ వేడుకలను నిర్వహించటం ఆనవాయితీ. గనిలో ప్రతిఏటా వేలాది మంది కార్మికులు వందల అడుగుల లోతుల్లో క్షేమంగా పనిచేసి తిరిగి వస్తున్నాంటే అది అమ్మవారి కృపే. గనిపై నిర్వహించే ఈ వేడుకలు టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో 9 రోజుల ఈ వేడుకల్లో కార్మికులు, అధికారులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందుతాము. ఒక్కతల్లి కడుపున పుట్టకున్నా.. ఒకే తల్లి గర్భంలో (గని)లో కలిసి పనిచేసే దయాదాక్షిణ్యాలు ఆ తల్లివే. – పిట్ కార్యదర్శి చిలక రాజయ్య

అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలి

టేకులపల్లి: ప్రతీరోజు పదేపదే జరుగుతున్న విద్యుత్ కోతలను ఆపాలని, రైతుల పంటలు ఎండిపోకుండా కాపాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత జర్పుల సుందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... ఆరుగాలం కష్టపడి కరెంటును నమ్ముకుని మిర్చి, వరి, మొక్కజొన్న పంటలను వేసుకుని విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రోజుకు ఏడెనిమిది సార్లు కరెంటు కట్ చేస్తున్నారని, వేసిన పంట ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు రైతుల పట్ల శ్రద్ధ చూపాలని కరెంటు కట్ చేయకుండా నిరంతరం కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భూక్యా పంతులు, సీతారాములు, లాలు, కాశీరాం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి..



మాట్లాడుతున్న బానోత్ మదన్‌లాల్

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ అన్నారు. శనివారం జూలూరుపాడులో మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ అధ్యక్షతన బూత్‌స్థాయి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. మదన్‌లాల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని, మూడోసారి ముఖ్యమంత్రిగా కె.చంద్రశేఖర్‌రావు పదవీ బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. బూత్‌స్థాయి కమిటీ సభ్యులు అనుసరించాల్సిన విధివిధాలను ఆయన వివరించారు. ఎమ్మెల్యేగా గెలిపించి వైరా నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని, నేను మీలో ఒకడిగాను, కుటుంబసభ్యునిగా ఉంటానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి పని చేస్తే వైరాలో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో భూక్యా కళావతి, ఎదళ్లపల్లి వీరభద్రం, పెండ్యాల రాజశేఖర్, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, రోకటి సురేష్, మూడ్ చిట్టిబాబు, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, నల్లపాటి రామారావు, మంగముడి నాగేశ్వరరావు, సాయిల నాగేశ్వరరావు, మోదుగు రామకృష్ణ, చాపలమడుగు రామ్మూర్తి, మాలోత్ నరసింహారావు, రెడ్డిబోయిన రాము, భూక్యా జవహర్‌లాల్, నిమ్మటూరి కనకయ్య, కట్రం మోహన్‌రావు, బాదావత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..



అన్నదానం ప్రారంభిస్తున్న శంకర్‌బాబు

కొత్తగూడెంటౌన్: ప్రముఖ వ్యాపారవేత్త వసుంధర-సుమంగళి షాపింగ్ మాల్ నిర్వాహకులు, కొత్తగూడెం గణేష్ టెంపుల్ పాలకమండలి చైర్మన్ తాటిపల్లి శంకర్‌బాబు ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో శనివారం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పల్లపోతు సాయి, కోదుమూరి శ్రీనివాస్, గౌరు వెంకటేశ్వర్లు, అత్తులూరి రమేష్, కంభంపాటి రమేష్, గుడిపాటి ఆనంద్, గుమలపురం సత్యనాయణలు తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మంగీలాల్

జూలూరుపాడు: భోజ్యా తండా గ్రామ పంచాయతీ వెనక తండాకు చెందిన పలు బీఆర్‌ఎస్ కుటుంబాలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో సుమారు 30 బీఆర్‌ఎస్ కుటుంబాల వారు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాలోత్ రాంబాబు, శాలి, బుక్కీ, అరుణ, సోమ్లా, మంగమ్మ, పద్మ, బానోత్ సేవా, శ్రీకాంత్, ధరావత్ రామదాస్, ధరంసోత్ వెంట్రామ్, వీరు, నాగు, ధరావత్ బాబూలాల్, నవీన్, బానోత్ రాములు, ఉషా, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ కిషన్ నాయక్, గుగులోత్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పూలు పంపిణీ

టేకులపల్లి: బతుకమ్మ వేడుకలు శనివారం ప్రారంభయ్యాయి. ఈ మేరకు హరిప్రియ హరిసింగ్ నాయక్ యువసేన అధ్యక్షుడు జాటోతు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో తూర్పుగూడెం, తూర్పుగూడెం తండాలో బతుకమ్మ వేడుకలు జరుపుకునేందుకు మహిళలకు పూలను వితరణగా అందజేశాడు.

ప్రవల్లిక మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న మోకాళ్ల రమేష్



పాల్వంచ: నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఇల్లెందు: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని టీపీటీఎఫ్ జిల్లా నాయకుడు బాలు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగి ప్రవల్లిక మృతికి సంతాపంగా శనివారం ఇల్లెందులో ఉపాధ్యాయ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన సభలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పేదరికమే ప్రవల్లిక మృతికి కారణం అన్నారు. గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మడి సమ్మయ్య, గొగ్గెల సమ్మయ్య, ఎమ్మానియేల్, మూనా, రమేష్, కిషన్, వెంకటరాం, వెంకటేశ్వర్లు, ప్రతాప్‌సింగ్, కాంపాటి పృథ్వీ, సాంబ, శ్యామ్, హరీష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఉద్యోగం రాదన్న ఆవేదనతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవడంపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ డిమాండ్ చేశారు. కొల్లాపురం గ్రామంలో శనివారం పీవైఎల్ కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపించి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆరోపించారు. ప్రశ్న పత్రాలు లీక్ కావడం వల్లే ఎంతోమంది విద్యార్థులు అన్యాయానికి గురయ్యారని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో యువత తమ ఓటుతో సీఎం కేసీఆర్‌కు గుణపాఠం చెబుతారన్నారు. రావూరి సతీష్, మోకాళ్ల సుగుణ, చీమల సమ్మక్క, వెంకటేష్, ప్రశాంతి, రమ్య, లక్ష్మి, రవి పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): గ్రూప్–2 పరీక్ష వాయిదా పడిందని, మనస్థాపానికి గురై హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన నిరుద్యోగ విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు లిక్కి బాలరాజు, హరికృష్ణ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పొన్నాల ఇంటికెళ్లిన కేటీఆర్.. మృతి చెందిన ప్రవల్లిక ఇంటికెళ్లలేదని, కనీసం వారి కుంటుంబానికి భరోసా ఇవ్వలేదని విమర్శించారు. ప్రవల్లిక కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, లేని పక్షంలో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పాల్వంచ: ప్రవల్లిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ముమ్మాటికీ ఇది ప్రభుత్వ హత్యేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. ప్రవల్లిక మృతి పట్ల అంబేద్కర్ సెంటర్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడారు. తోట దేవీప్రసన్న, చాంద్ పాషా, యర్రంశెట్టి ముత్తయ్య, లోగాని మురళీ, చారి, పెంకి శ్రీనివాస్, తుమ్మల శివారెడ్డి, కాపా శ్రీనివాసరావు, దేవీలాల్, ఇజ్జగాని రవిగౌడ్, జోషి, శ్రీరాములు, సత్యనారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న పులి సైదులు

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని, నేడు గులాబీ కండువా కప్పుకున్న వారికే అందుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. మర్రిగూడెం గ్రామపంచాయతీ ఏడుప్పులగూడెం గ్రామంలో పలు కుటుంబాలు శనివారం చీమల వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్దకాలంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, దళిత బంధు వంటి అనేక పథకాలు దరఖాస్తులకే పరిమితమయ్యాయని గుర్తుచేశారు. సమావేశంలో సాగ్రమాట్, కాయం రమేష్ పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా.. గెలిపించుకుందాం..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని నిర్ణయించినా వారి గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పులి సైదులు, ఆరెం కిరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని రొంపేడు గ్రామ సమీపంలో కాంగ్రెస్ మండల శాఖ కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీసుకోవాలిన్న జాగ్రత్తలపై నేతలు చర్చించారు. పులి సైదులు, ఆరెం కిరణ్, వల్లాల రాజయ్య, శ్రీరాములు, మాలోత్ ధన్‌సింగ్, పడిగిద్దరాజు, ఇస్లావత్ సతీష్, వజ్జ చరణ్, గడదాసు వెంకన్న, ఫక్రుద్దీన్, ఆజ్మీర రవి, మోహన్, రాము, సురేందర్ పాల్గొన్నారు.